## క్లుప్తంగా

### 'తూటా' అధ్యక్షుడిగా డాక్టర్ సాయికృష్ణ నిఖిల్


సాయికృష్ణను సన్మానిస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (తూటా) అధ్యక్షుడిగా డాక్టర్ బి.సాయికృష్ణ నిఖిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు ఆయనను కలిసి అభినందలు తెలిపారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ... విద్యార్థుల సంక్షేమం, పరిశోధన, ప్రోత్సాహం, నూతన సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ, ఉద్యానవన విద్యా ప్రమాణాల పెంపు వంటి అంశాల్లో కొత్త అధ్యక్షుడు ప్రత్యేక దృష్టి సారిస్తారని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడు నాగులపల్లి సంగారెడ్డి, సాయికిరణ్, తరుణ్‌రెడ్డి, చికల్‌రెడ్డి, సోని, ప్రతినిధులు, పలు విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్ సోమవారం పరిశీలించారు. ఐదో రోజు ఆదివారం పత్తికుంటకు వందలాదిగా గణనాథుల ప్రతిమలు నిమజ్జనానికి తరలివచ్చాయి. నిమజ్జన ప్రక్రియ ఆదివారం అర్ధరాత్రి వరకు సాగింది. సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే పారిశుద్ధ్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్‌సాగర్ వరకు రేడియల్ రోడ్డును పూర్తిగా శుభ్ర పరిచారు. అలాగే పత్తికుంటతో పాటు పక్కనే ఉన్న ప్రత్యేక కొలనులో భక్తులు వేసిన పూజ సామాగ్రిని పూర్తిగా తొలగించారు. కొలనులో నీటిని తొడి కొత్త నీటితో నింపారు. ఈ ప్రక్రియ ఉదయం 11 గంటల వరకు సాగింది. ఈ పనులను ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్‌లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. గణేశ్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఊరేగింపు నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఈఈ నరేందర్, బీజేపీ నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నారమ్స్ ఫౌండేషన్ డే


అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలతో నారమ్స్ అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్స్) 50 వ ఫౌండేషన్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్‌ఆర్‌బీ మాజీ చైర్మన్ డాక్టర్ గుర్బచన్ సింగ్ నారమ్స్ సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ పరిశోధనా సంస్థలలో నారమ్స్ ఒకటని అన్నారు. నారమ్స్ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన పరిశోధన సంస్థ అని అన్నారు. నారమ్స్ ఎంతో మందో వ్యవసాయ శాస్త్రవేత్తలను తయారు చేసిందన్నారు. ఇందులో పలువురు శాస్త్రవేత్తలు, వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో నబార్డ్ మాజీ చైర్మన్ డాక్టర్ గోవిందరాజులు చింతల, పీవీ నర్సింహారావు, వెటర్నరీ వీసీ జ్ఞానప్రకాశ్, ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ సిమాజగ్గి, నారమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

### చెట్టును ఢీకొన్న ఆటో

- డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో ప్రమాదానికి గురైన ఆటో
- తీవ్రంగా గాయపడిన డ్రైవర్

రాజేంద్రనగర్: ఆటో ట్రాలీ నడుపుతున్న ఓ డ్రైవర్‌కు ఫిట్స్ (మూర్ఛ) రావడంతో రోడ్డు పక్కనే ఉన్న భారీ వృక్షానికి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తిని 108 సిబ్బంది ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... శివరాంపల్లి ప్రాంతానికి చెందిన పవన్(29) ఆటో ట్రాలీ డ్రైవర్. సోమవారం సాయంత్రం తన ఆటోలో బొగ్గు లోడ్ చేసుకొని రాజేంద్రనగర్ వైపు పయనమయ్యాడు. యూనివర్సిటీ దారి గుండా వెళుతుండగా ఆయనకు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆ వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న వృక్షానికి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయపడ్డ పవన్‌ను స్థానికులు 108 సిబ్బంది సహాయంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో ఆటో ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఈ దారిలో వాహనాల రాకపోకలు అంతగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## గణేశ్ లడ్డూలకు..

# భలే డిమాండ్


బృందావన్ ఎన్‌క్లేవ్‌లో మూడావత్ దేవ్‌సింగ్

- పోటాపోటీగా ప్రసాదం లడ్డూల వేలంపాటలు
- భారీగా వేలం పాడి లడ్డూలను దక్కించుకుంటున్న భక్తులు
- రూ. లక్షలు వెచ్చించి సొంతం చేసుకుంటున్న వైనం

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రుల్లో వినాయక విగ్రహాల చేతుల్లో పూజలందుకున్న లడ్డూల వేలం పాట రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జోరుగా సాగుతోంది. లడ్డూలను సొంతం చేసుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. ప్రతి సంవత్సరం గణనాథుల లడ్డూల ధరలు రూ. వేల నుంచి లక్షల రూపాయల వరకు పెరుగుతున్నాయి. గత ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథులను మండపాల నిర్వాహకులు ఆదివారం ఐదో రోజు నిమజ్జనాలకు తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూల వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు.


బండ్లగూడ యాదాద్రి కాలనీలో బాలరాజ్‌గౌడ్


హైదర్‌గూడలోని హిమసాయి అపార్ట్‌మెంట్‌లో బబ్లూ

❖ రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడలోని హిమసాయి అపార్ట్‌మెంట్ లడ్డూను అపార్ట్‌మెంట్ వాసి బబ్లూ రూ. 5.50 లక్షలకు దక్కించుకున్నాడు. అపార్ట్‌మెంటువాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గణనాథుడి లడ్డూ రూ. 5.50 లక్షల ధర పలకడం విశేషం. నిర్వాహకులు బబ్లూ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు. అనంతరం గణనాథుని ఊరేగింపును నిర్వహించారు.

❖ కిస్మత్‌పూర్ బృందావన్ ఎన్‌క్లేవ్ గణనాథుని లడ్డూను వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండలం బండమీది తండా గ్రామ పంచాయతీ సెక్రటరీ ముడావత్ దేవ్ సింగ్ రూ. 91 వేలకు వేలం పాటలో దక్కించుకున్నాడు. రూ. 1 నుంచి ప్రారంభమైన ఈ వేలం పాటలో కాలనీవాసులు పోటీపడి రూ. 91 వేల వరకు పాట పాడారు. చివరకు ముడావత్ దేవ్ సింగ్ లడ్డూను సొంతం చేసుకున్నాడు.

❖ బుద్వేల్‌లో గణనాథుని లడ్డూను స్థానికుడు పెండ్యాల శ్రీధర్ రూ. 35 వేలకు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు.

#### అదృష్టం వరిస్తుందనే నమ్మకం...

గణనాథుని చేతిలో పూజలందుకున్న లడ్డూను కైవసం చేసుకుంటే అదృష్టం వరిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో భక్తులు పోటీ పడి ఈ లడ్డూను కైవసం చేసుకుంటున్నారు. గతంలో వేలల్లో ధర పలికే లడ్డూలు ప్రస్తుతం లక్షల్లోకి చేరుతుంది. డబ్బులు సైతం లెక్క చేయకుండా భక్తులు పోటీ పడి లడ్డూను సొంతం చేసుకుంటున్నారు. లడ్డూ సొంతం చేసుకున్న తమకు అన్ని విధాలుగా కలిసి వస్తుందని... అందుకే లడ్డూలను కొనుగోలు చేస్తున్నామని తెలుపుతున్నారు. లడ్డూలు కొనుగోలు చేసిన వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించి వారికి కానుకలను సైతం అందజేస్తున్నారు.

#### అన్ని మండపాల్లో...

నియోజకవర్గ పరిధిలోని అన్ని గణనాథుని మండపాల్లో నిర్వాహకులు గణనాథుని లడ్డూ వేలం కోసం సకల ఏర్పాట్లు చేపడుతున్నారు. 7, 9, 11వ రోజుల్లో గణనాథుని ఊరేగింపు కోసం ఏర్పాట్లు చేపడుతూనే ప్రత్యేకంగా లడ్డూల వేలం కోసం తగు చర్యలు చేపడుతున్నారు. భక్తులందరినీ వేలం పాటకు రప్పిస్తూ ప్రత్యేకంగా ఆహ్వాన పత్రాలను తయారు చేసి అందిస్తున్నారు. లడ్డూ వేలం పాట అనంతరం ఊరేగింపు సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.


బుద్వేల్‌లో లడ్డూను కైవసం చేసుకున్న పెండ్యాల శ్రీధర్

#### బండ్లగూడ పరిధిలో...

బండ్లగూడ: భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడి లడ్డూలు వేలం పాటలో లక్షలు పలుకుతున్నాయి. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ. 1,31,116లకు బాలరాజుగౌడ్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి లడ్డూను అందించారు.

#### మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో...

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి దాటే వరకు వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. కొన్ని వినాయకులను ఆదివారం కదలించి సోమవారం నిమజ్జనం చేశారు. అంతకు ముందు మండపాలలో వినాయకుడి చేతుల్లోని లడ్డూలను వేలం పాటలు నిర్వహించారు. అందులో భాగంగా కోకాపేట లెజెండ్ చైమ్స్ విల్లా గేటెడ్ కమ్యూనిటీ వినాయకుడి లడ్డూ ఏకంగా రూ. 11 లక్షలు పలికింది. ఆ తరువాతి స్థానంలో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ఆనంద బే హిల్స్ వినాయకుడి లడ్డూ రూ. 7,27,127లకు దక్కించుకున్నారు. హాల్ మార్క్ విసినియా గేటెడ్ కమ్యూనిటీ వినాయకుడి లడ్డూ రూ. 4.20 లక్షలు పలికింది. ఈ నెల 4వ తేదీ, 6వ తేదీల్లోనూ వినాయకుడి లడ్డూల వేలం పాటలు జరగనున్నాయి.


కోకాపేట లెజెండ్ చైమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో సంతోష్‌కుమార్ దంపతులు


హాల్‌మార్క్ విసినియా వినాయకుడి లడ్డూను రూ. 4.20 లక్షలకు దక్కించుకున్న జైపాల్‌రెడ్డి దంపతులు


నార్సింగి ఆనంద బే హిల్స్‌లో నాగరాజు బృందం


నార్సింగి ఆనంద పోయట్రీలో నీలేష్‌ప్రసాద్ దూబే

#### శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని వివేకానంద కాలనీలో పూజలందుకుంటున్న ప్రకృతి వరసిద్ధి వినాయకుడికి పల్లకి సేవను నిర్వహించారు. హిందూవికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని మేళతాళాలు, భజనలతో ఊరేగించారు.

❖ శారదా విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. పాతశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఊరేగించి కాముని చెరువులో నిమజ్జనం చేశారు.


హాల్‌మార్క్ ఫాంబ్రిజ్‌లో రామకృష్ణారెడ్డి దంపతులు

#### కవ్వగూడలో...

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలం కవ్వగూడలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా దాత కుక్కల బాల్‌రాజ్ అన్నప్రసాద వితరణ చేశారు. మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వివేకానంద కాలనీలో హిందూ వికాస్ ఉత్సవ సమితి వినాయకుడు


నిమజ్జనానికి తరలివెళ్తున్న శారదా విద్యామందిర్ గణపతి


కవ్వగూడలో పూజలు నిర్వహిస్తున్న స్థానికులు


కోకాపేట విజలింగ్ వుడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో దయాకర్‌రెడ్డి, సంజీవయ్య


మణికొండ స్వర్ణ ప్యాలెస్‌లో వెంకట విశ్వనాథం బృందం...


కవ్వగూడలో అన్నప్రసాద వితరణ చేస్తున్న దాత బాల్‌రాజ్

## గణపతి బప్పా మోరియా..

- కొనసాగుతున్న పూజలు
- హోరెత్తుతున్న మండపాలు


మార్కండేయనగర్‌లో పూజల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ/మైలార్‌దేవ్‌పల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాలను చిన్నాపెద్ద అనే తేడా లేకుండా గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ చోరియా అనే నినాదాలతో హోరెత్తిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఏర్పాటు చేసిన వినాయకులు నిమజ్జనానికి తరలివెళ్లగా కాలనీలు, దేవాలయాలు, ముఖ్య కూడలిలలో ఏర్పాటు చేసిన వినాయకులు మాత్రం పూజలందుకుంటున్నాయి. ప్రతి ఒక్కరూ భక్తి భావన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు గద్దె యాదగిరి, వర్కల చందు, శ్యామ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌షాకోట్‌లోని మేఘన రెసిడెన్సీలో గణేశుడు.. బాల గణేశుడి ప్రతిమలతో భక్తులు


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు


హైదర్‌గూడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నేతలు


నెక్నాంపూర్ ఎస్సీ బస్తీలో నార్సింగి కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్


పుప్పాలగూడ సాయిరాం కాలనీలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు

## మలుపులు తిరుగుతున్న బుల్లెట్ల కేసు

- పీటీ వారెంట్‌తో తీసుకెళ్లేందుకు
- సిద్ధమైన పంజాబ్ పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆగస్టు 28న బుల్లెట్లతో పట్టుబడిన వ్యక్తి కేసు మలుపులు తీరుగుతోంది. 2023లో అమృత్‌సర్ సమీపంలోని అజ్‌నలా పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన ఫైరింగ్ కేసులో పదిహేడో నిందితుడిగా ఆ వ్యక్తిని గుర్తించారు. పంజాబ్ రాష్ట్రం భవానిగర్గ్‌కు చెందిన సుఖ్‌బీర్ సింగ్(32) శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ మీదుగా అమృత్‌సర్‌కు వెళ్లేందుకు బోర్డింగ్ చేసుకునే సమయంలో తనిఖీలు నిర్వహించిన భద్రతాధికారులు అతడి లగేజీలో ఉన్న 8 రౌండ్ల బుల్లెట్లు గుర్తించారు. వాటికి సంబంధించిన ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులు అక్రమంగా ఆయుధ రవాణా కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. రాడికల్ నాయకుడి అరెస్ట్‌కు సంబంధించిన ఓ వ్యక్తి అరెస్ట్ చేయడానికి నిరసనగా వచ్చిన నిరసనకారులు అజ్‌నలా పోలీస్‌స్టేషన్ వద్ద బీభత్సం సృష్టించారు. ఈ కేసులో అక్కడి పోలీసులు సుమారు 250 మంది నిరసనకారులపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు అందులో 39 అరెస్ట్ చేసినట్లు చూపారు. ఇదే కేసులో సుఖ్‌బీర్ సింగ్ కూడా పదిహేడో నిందితుడిగా ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించి పంజాబ్ పోలీసులతో మాట్లాడారు. సుఖ్‌బీర్ సింగ్‌ను పీటీ వారెంట్ ద్వారా కోర్టు ముందు హాజరుపర్చి పంజాబ్‌కు తీసుకెళ్లేందుకు అక్కడి పోలీసులు నాలుగు రోజుల కిందటే ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పంజాబ్‌లో ప్రస్తుతం తీవ్రంగా వరదలు ఉన్న కారణంగా వారి రాక ఆలస్యమైనట్లు సమాచారం. ప్రస్తుతం నిందితుడు జ్యుడీషియల్ రిమాండ్‌లో చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. ఒకటి రెండు రోజుల్లో పంజాబ్ పోలీసులు నిందితుడిని తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

## ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 టోల్ గేట్ మూసివేత

- గణేశ్ నిమజ్జన ఊరేగింపుల కారణంగా...
- 2, 4వ తేదీల్లో మూసివేస్తాం
- ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజి



రాజేంద్రనగర్: గణేశ్ నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో రాజేంద్రనగర్ హిమాయత్‌సాగర్, ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 టోల్ గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజి వెల్లడించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిమజ్జన ఊరేగింపు 7వ రోజు, 9వ రోజు పెద్ద ఎత్తున గణనాథులు రాజేంద్రనగర్ పత్తికుంటకు తరలివస్తాయన్నారు. ఆ రోజున ఊరేగింపుతో పాటు వాహనాలకు ఇబ్బంది కలుగకుండా ఓఆర్ఆర్ పైకి వచ్చే, పైకి వెళ్లే భారీ వాహనాలను ఎగ్జిట్-16 మీదుగా దారి మళ్లిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు.

- పత్తికుంటకు రాజేంద్రనగర్ నియోజకవర్గమే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన గణనాథులు నిమజ్జనానికి పెద్ద ఎత్తున తరలివస్తాయన్నారు. రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్ వరకు ఉన్న రేడియల్ రోడ్డు గణనాథుల ఊరేగింపుతోనే నిండుకొని ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఆర్ ఎగ్జిట్-17ను తాత్కాలికంగా ఈ నెల 2, 4వ తేదీల్లో రెండు రోజుల పాటు మూసి వేస్తాయన్నారు.
- 11వ రోజు (6వ తేదీ)న గణనాథుల ఊరేగింపుకు అనుగుణంగా అప్పటికప్పుడు చర్యలు చేపడుతామన్నారు. అలాగే పీడీపీ చౌరస్తా నుంచి రాజేంద్రనగర్‌కు వెళ్లే వాహనాలను సైతం దారి మళ్లిస్తామన్నారు. ఊరేగింపు సాయంత్రం నుంచి ఊపందుకుంటుందని అందుకు అనుగుణంగా తాము చర్యలు చేపడుతామన్నారు. తమ సిబ్బంది ట్రాఫిక్‌కు ఎక్కడ ఎలాంటి అంతరాయం కలుగకుండా తగు చర్యలు చేపడుతారన్నారు.
- ఓఆర్ఆర్‌పై నుంచి భారీ వాహనాలు వస్తాయని... వారికి ఇబ్బంది కలుగకుండా తమ సిబ్బంది డైవర్షన్‌ను వివరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపిస్తారన్నారు. ఊరేగింపు నేపథ్యంలో పత్తికుంట, పల్లెచెరువు ప్రాంతాల వాసులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు.
- స్థానికంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను వాడుకోవాలన్నారు. పల్లె చెరువు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా తమ సిబ్బంది ప్రత్యేకంగా పికెటింగ్‌ను ఏర్పాటు చేసి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పత్తికుంట వద్దే ట్రాఫిక్ క్రమబద్ధకరణ ఉంటుందన్నారు.

## అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

శంషాబాద్ రూరల్: సుల్తాన్‌పల్లి గ్రామంలో రోడ్లు, భూగర్భ మురుగు కాలువ అభివృద్ధి కోసం నిధులు మంజూరైనట్లు మాజీ సర్పంచ్ దండు ఇస్తారి తెలిపారు. సీఆర్ఆర్‌లో భాగంగా రూ. 2.40 కోట్లు నిధులకు సంబంధించి మంజూరు పత్రాలను సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అందజేసినట్లు ఆయన తెలిపారు. కాచారం-సుల్తాన్‌పల్లి లింక్ రోడ్డును బీటీగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

